క్లుప్తంగా

19 నుంచి క్రీడా పోటీలు


కొలుములపల్లె గ్రామంలో పోటీలకు సిద్ధమవుతున్న మైదానం

బేతంచెర్ల: మండల పరిధిలోని కొలుములపల్లె జెడ్పీ హైస్కూల్‌లో ఈనెల 19వ తేదీ నుంచి (ఎస్‌జీఎఫ్) స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ సోమశేఖర్, మండల కోఆర్డినేటర్ వెంకటేష్ నాయక్ ఆదివారం తెలిపారు. అండర్-14, 17 విభాగాల్లో బాలబాలికలకు పోటీలు నిర్వహిస్తామన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, యోగా, చెస్, అథ్లెటిక్స్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

సుంకులమ్మకు ప్రత్యేక పూజలు


చల్ల కడవలతో వస్తున్న భక్తులు

బేతంచెర్ల: వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని కోరుతూ మండల పరిధిలోని రంగాపురం గ్రామంలో సుంకులమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన ఆలయ పూజారి కుమ్మరి మద్దిలేటి స్వామి, గ్రామం తరఫున యామసాని వెంకటరామిరెడ్డి చల్ల కడవలతో గ్రామ పురవీధుల మీదుగా అమ్మవారి ఆలయం చేరుకుని పూజలు చేశారు.

చౌడేశ్వరిదేవి ఆలయ అభివృద్ధికి విరాళం


విరాళం అందజేస్తున్న దాత కుటుంబ సభ్యులు

బనగానపల్లె రూరల్: మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన చౌడేశ్వరిదేవి ఆలయాభివృద్ధికి డోన్ పట్టణానికి చెందిన బొబ్బలి మోక్షిత కుటుంబ సభ్యులు రూ.50 వేల విరాళాన్ని అందజేసినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ ఆదివారం తెలిపారు. ఈ విరాళంలో రూ.25 వేలు నిత్యాన్నదానం కోసం, మరో రూ.25 వేలు ఆలయ అభివృద్ధి కోసం అందజేసినట్లు పేర్కొన్నారు. దాత కుటుంబ సభ్యులకు అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ మాజీ చైర్మన్ పీవీ కుమార్ రెడ్డి, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లు సీజ్



సీజ్ చేసిన వాహనాలు

డోన్ టౌన్: పట్టణ సమీపంలోని గుడి తిప్ప కొండ నుంచి ఎలాంటి అనుమతి లేకుండా మట్టి తరలిస్తున్న మూడు ట్రాక్టర్లు, ఒక జేసీబీని పట్టణ పోలీసులు ఆదివారం సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి రెవెన్యూ అధికారులకు బదిలీ చేస్తామని పట్టణ పోలీసులు తెలిపారు.

చంద్రగ్రహణం లేదు

డోన్ టౌన్: ఈ నెల 18వ తేదీ బుధవారం పౌర్ణమికి ఎలాంటి గ్రహణాలు లేవని సాంబ శివాలయం ప్రధాన అర్చకుడు, గాయత్రి బ్రాహ్మణ సంఘం ఉపాధ్యక్షుడు కళ్లె శేషావలి శర్మ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పౌర్ణమి మంగళవారం సాయంత్రం ప్రారంభమై బుధవారం ఉదయం 9 గంటల తరువాత ముగుస్తుందని, మహాలయ పౌర్ణమి పురస్కరించుకుని చేసే పండుగ మాలపున్నం మంగళవారం నిర్వహించుకోవచ్చని పేర్కొన్నారు. పౌర్ణమి రోజు చంద్ర గ్రహం ఉందని కొందరు అపోహ పడుతున్నారని.. దేశంలో చంద్రగ్రహణం కనిపించదని తెలిపారు.

ఉపాధ్యాయులకు సత్కారం


సన్మానిస్తున్న ప్రభుత్వ పెన్షనర్ల సంఘం

డోన్: పదవీ విరమణ పొందిన ప్రభుత్వ ఉద్యోగులందరూ సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ శేష జీవితం సంతృప్తితో కొనసాగించాలని ప్రభుత్వ పెన్షనర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి భానుసింగ్ అన్నారు. పదవీ విరమణ చేసిన ప్రభుత్వ ఉపాధ్యాయులు శ్రీనివాసులు, రవిశేఖర్, లలిత, బాలయ్యలను ఆదివారం ప్రభుత్వ పెన్షనర్ల సంఘం తరుఫున ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి గాలయ్య, అసోసియేట్ ప్రెసిడెంట్ సుబ్బరాయుడు, కోశాధికారి గోపాల్, సభ్యులు నరసింహులు, రామక్రిష్ణారెడ్డి, ఆంజనేయులు, రాందాస్‌రెడ్డి, చెన్నకేశవులు, నేత్రానంద, హుసేన్‌సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వైద్య విద్యను దూరం చేసే కుట్ర



కూటమి ప్రభుత్వం పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసే కుట్ర చేస్తోంది. చేసిన తప్పును కప్పి పుచ్చేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం సిగ్గుచేటు. గత ప్రభుత్వంలో మెడికల్ కాలేజీల నిర్మాణం పూర్తికాకుండానే ప్రారంభించారని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ తప్పుడు ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే కొత్త మెడికల్ కళాశాలలను పూర్తి చేసి విద్యార్థులకు న్యాయం చేయాలి.

–మల్కిరెడ్డి వెంకట సుబ్బారెడ్డి, ఉమ్మడి కర్నూలు జిల్లా పరిషత్ మాజీ చైర్మన్



విద్యార్థుల జీవితాలతో చెలగాటం



ఎన్నో ఆశలతో వైద్య విద్య అభ్యసించాలని కలలుగనే విద్యార్థుల జీవితాలతో కూటమి ప్రభుత్వం చెలగాటం ఆడుతోంది. ఏ ప్రభుత్వమైనా మెడికల్ కాలేజీలు, సీట్లు కావాలని కోరుకుంటుందని, కానీ కూటమి ప్రభుత్వం మంజూరైన ఎంబీబీఎస్ సీట్లు వద్దని చెప్పడం దారుణం. ఇంత కన్నా సిగ్గుచేటు లేదు. కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల ఆశావహులైన వైద్య విద్యార్థులకు తీరని నష్టం జరుగుతుంది. గత ప్రభుత్వం మెడికల్ కాలేజీలు తీసుకొస్తే కుంటి సాకులు చెప్పడం సరికాదు. విద్యార్థి లోకం ఉద్యమించే రోజులు దగ్గర్లో ఉన్నాయి.

–మహేశ్వరరెడ్డి, న్యాయవాది, కొలిమిగుండ్ల

నిండుకుండలా అవుకు జలాశయం



అవుకు: ఇటీవల కురిసిన వర్షాలకు అవుకు జలాశయం నిండుకుండలా మారింది. వర్షాలకు తోడు శ్రీశైలం జలాయశం నుంచి జీఎన్‌ఎస్‌ఎస్ కాలువ, ఎస్సార్బీసీ కాలువల ద్వారా భారీగా వరద నీరు చేరుతోంది. అవుకు రిజర్వాయర్ 4.168 టీఎంసీల సామర్థ్యం ఉండగా ఆదివారం 3 టీఎంసీలకు చేరిందని అధికారులు తెలిపారు. జీఎన్‌ఎస్‌ఎస్ కాలువ ద్వారా వచ్చే 12వేల క్యూసెక్కుల నీటిని చెర్లోపల్లె సమీపంలోని హెడ్‌రెగ్యులేటర్ ద్వారా గండికోట జలాశయానికి వదులుతున్నారు. అలాగే ఎస్సార్బీసీ కాలువ ద్వారా రిజర్వాయర్‌లోకి వచ్చే 260 క్యూసెక్కుల నీటిని పంట కాలువలకు వదులుతున్నారు. రిజర్వాయర్‌లో నీరు సమృద్ధిగా ఉండడంతో రైతులు జోరుగా పంటల సాగు చేస్తున్నారు. అవుకు రిజర్వాయర్ ఆయకట్టు కింద 1,650 ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. అలాగే బనగానపల్లె, కోవెలకుంట్ల సబ్ డివిజన్‌ల పరిధిలోని అవుకు మండలంలో దాదాపు 13 వేల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు అవుతున్నాయి.

• పెరిగిన వరిసాగు విస్తీర్ణం


విస్తారంగా వరి పంటసాగు

బనగానపల్లె: నియోజకవర్గంలో ఈ ఏడాది ఖరీఫ్‌లో వరిసాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. ఎస్సార్బీసీ, వ్యవసాయ బోర్ల ఆధారంగా గత ఏడాది ఖరీఫ్‌లో 15,600 హెక్టార్లలో సాగు చేశారు. ఈ దఫా 19, 300 హెక్టార్లకు పెరిగినట్లు వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. గత సంవత్సరం 75 కిలోల వరిబస్తా రూ.2,200 నుంచి రూ.2,300 వరకు గిట్టుబాటు ధర లభించింది. దీంతో ఈ ఏడాది వరి సాగుకు రైతులు మొగ్గు చూపారు. నంద్యాల సోనా వరిని గణనీయంగా సాగు చేశారు. గత ఏడాది మొక్కజొన్న దిగుబడి ఆశాజనకంగా ఉండి గిట్టుబాటు ధర లభించడంతో ఈ సంవత్సరం గణనీయంగా సుమారు 8,600 హెక్టార్లలో ఈ పంటను సాగు చేసినట్లు వ్యవసాయాధికారులు పేర్కొన్నారు.

మిలాద్ ఉన్ నబీకి మసీదుల ముస్తాబు


విద్యుత్ దీపాలంకరణలో లాల్ మసీదు,


ఆస్థానం రోడ్డులో విద్యుత్ వెలుగులు

బనగానపల్లె రూరల్: మిలాద్ ఉన్ నబీ (మహమ్మద్ ప్రవక్త జన్మదినం)ను సోమవారం ఘనంగా నిర్వహించేందుకు అన్ని మసీదులు ముస్తాబయ్యాయి. బనగానపల్లె పట్టణంలోని లాల్‌మసీదు, జుమ్మా మసీదు, జెండేవాలే సాహెబ్ మసీదు, జింగ్లీమా మసీదు, ఏక్ కమాన్ మసీదు, ఖాజీవాడ మసీదు, మాసుం బాషా తదితర మసీదులను విద్యుత్ దీపాలతో అలంకరించారు. అలాగే పట్టణంలోని పెట్రోల్ బంకు సమీపంలో ఉన్న దస్తగిరి స్వామి దర్గా నుంచి పాత ఆంధ్రా బ్యాంకు రోడ్డు, ఆస్థానం రోడ్డు, పోలీసు సర్కిల్ కార్యాలయం రోడ్డు నుంచి లాల్ మసీదు వరకు ఇరువైపులా ఎల్‌ఈడీ బల్బులతో సుందరంగా అలంకరించారు. ఉదయం 8.30 గంటల నుంచి దస్తగిరి స్వామి దర్గా నుంచి పాత బస్టాండ్ వరకు ర్యాలీ ఉంటుందని ముస్లిం పెద్దలు తెలిపారు.

విద్యతోనే బంగారు భవిష్యత్తు


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ

డోన్ టౌన్: విద్యతోనే పిల్లలకు బంగారు భవిష్యత్తు ఉంటుందని పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా అన్నారు. స్థానిక వడ్డెర సంక్షేమ సంఘం భవన్‌లో సంఘం అధ్యక్షుడు నాగరాజు అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వడ్డెర్లలో చాలా మంది అవగాహన లేక విద్యకు దూరమై జీవితంలో కష్టాలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. తమ పిల్లలనైనా బాగా చదివించి వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని సూచించారు. మద్యానికి బానిసైతే జీవితం నాశనం అవుతుందన్నారు. కుటుంబ పెద్దకు ఏమైనా జరిగితే కుటుంబాలు రోడ్డున పడుతాయన్నారు. ప్రతి ఒక్కరూ ఇన్సూరెన్స్ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వడ్డెర సంఘం నాయకులు చిన్నమద్దిలేటి, అంకాల శ్రీను, గోవిందు, లక్ష్మీనారాయణ, మధు, బలరాముడు, వెంకటేష్, వెంకట్రాముడు తదితరులు పాల్గొన్నారు.

బేతంచెర్లలో ముస్లింల ర్యాలీ


ప్రార్థన గీతాలను ఆలపిస్తున్న మండల ఖాజీ నూర్‌అహ్మద్, ముస్లింలు

బేతంచెర్ల: మిలాద్-ఉన్-నబీ పండుగను పురస్కరించుకుని పట్టణంలో ముస్లింలు జెండాలు పట్టుకుని ఆదివారం ర్యాలీ నిర్వహించారు. స్థానిక జెండాపేట మసీదు నుంచి మెయిన్ బజార్, ప్రధాన రహదారి వెంట మండల ఖాజీ నూర్ అహ్మద్ ఆధ్వర్యంలో ర్యాలీ చేశారు. అసూయకు దూరంగా ఉంటూ సమాజ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ముస్లింలు ముర్తుజావలీ, ఖాజా హుసేన్, సద్దామ్, ఖాజా, మగ్బుల్, రహంతుల్లా, అక్తాబ్ తదితరులు పాల్గొన్నారు.

మూగజీవాల మృత్యుఘోష


కనకాద్రిపల్లెలో మృతి చెందిన పాడి గేదె

కొలిమిగుండ్ల: మూగ జీవాలు వాహన చోదకుల నిర్లక్ష్యం కారణంగా రోడ్డు ప్రమాదాల్లో మృత్యువాత పడుతున్నాయి. రెండు రోజుల క్రితం కనకాద్రిపల్లె ఎగువ ప్రాంతంలోని ప్రధాన రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో పాడిగేదె తీవ్రంగా గాయపడి రోడ్డుపైనే పడిపోయింది. అటుగా వెళుతున్న ద్విచక్ర వాహనదారులు చలించి గేదె చుట్టూ రాళ్లు అడ్డుగా పెట్టారు. చివరకు గేదె మృతి చెందింది. ఇలాంటి ఘటనలు ప్రధాన రహదారులపై తరచూ చోటు చేసుకుంటున్నాయి. పాడి రైతులు గేదెలను మేత కోసం వదులుతుంటారు. ఈ క్రమంలో వాహన చోదకులు నిర్లక్ష్యం, వేగంగా డ్రైవింగ్ చేయడం వల్ల మూగ జీవాలు ప్రాణాలు కోల్పోతున్నాయి. గేదెలు చనిపోవడం వల్ల రైతులకు వేలాది రూపాయలు నష్టం వాటిల్లుతోంది.

నూనె ధరల పెంపు సరికాదు


మాట్లాడుతున్న జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడు నాగరాజు

డోన్ టౌన్: వంట నూనె ధరల పెంపు సరికాదని.. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకించాలని జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడు ఏఈ నాగరాజు డిమాండ్ చేశారు. స్థానిక ముక్తేశ్వర ఆలయం వద్ద ఆదివారం జరిగిన వినియోగదారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గతంలో ఎప్పుడు లేని విధంగా వంట నూనెలపై అత్యధికంగా పన్ను విధించారని తెలిపారు. ఏపీలో ఒక్క రోజులో 30 లక్షల లీటర్ల వంట నూనె వినియోగిస్తున్నారని.. ధరల పెంపు వల్ల ఒక్క రోజుకు రూ.9కోట్ల భారం ప్రజలపై పడుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో చర్చించి ధరలు తగ్గించేందుకు కృషి చేయాలన్నారు.

రెవరెండ్‌కు సన్మానం

బనగానపల్లె: స్థానిక ఐసీఎస్ చర్చి రెవరెండ్ ఆల్బర్ట్ పదవీవిరమణ సందర్భంగా ఆదివారం చర్చిలో ఆయన్ను సన్మానించారు. సీఎస్ఐ రాయలసీమ అధ్యక్ష మండలి పీఠాధిపతి బిషప్ ఐజక్ వరప్రసాద్ మాట్లాడుతూ.. బనగానపల్లె పట్టణంలో ఐదేళ్లుగా సేవలందించారని తెలిపారు. చర్చి అభివృద్ధికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. సంఘ పెద్దలు మనోహర్, ప్రసాద్, కరుణాకర్, మంజులమణి, సరోజసుందరం తదితరులు పాల్గొన్నారు.


రెవరెండ్ ఆల్బర్ట్ దంపతులను సన్మానిస్తున్న బిషప్

వీహెచ్‌పీ సభ్యుడు జీవన్ మృతి


జీవన్(ఫైల్)

డోన్ టౌన్: పట్టణానికి చెందిన ప్రముఖ మెకానిక్, విశ్వహిందూ పరిషత్ సభ్యుడు మల్కారి జగజీవన్ రావు (65)ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈయన అయోధ్య రామాలయ నిర్మాణంలో కర సేవకులతో పాటు నిధుల సమీకరణ చేశారు. గతంలో లారీ మెకానిక్‌ల సంఘం అధ్యక్షుడిగా పనిచేశారు. ఈయన మృతిపై విశ్వ హిందూ పరిషత్ సభ్యులు, లారీ మెకానిక్‌లు సంతాపం తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బనగానపల్లె రూరల్: యనకండ్ల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని హుస్సేనాపురం ఫీడర్‌లో మరమ్మతు పనుల కారణంగా సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ రూరల్ ఏఈ గర్జప్ప తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు. రైతులకు అందించే ఉచిత విద్యుత్ తెల్లవారుజామున 3 గంటల నుంచి ఉదయం 9 గంటల వరకు. అలాగే మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సరఫరా ఉంటుందని పేర్కొన్నారు. వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

వ్యవసాయానికి ఈవారం విద్యుత్ వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఆయా ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి పూట తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేయనున్నట్లు ఆ శాఖ ఏఈ రామమోహన్ తెలిపారు. కోవెలకుంట్ల, కలుగొట్ల, గుళ్లదూర్తి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని భీమునిపాడు, అమడాల, గుంజలపాడు, జోళదరాశి, రేవనూరు, కలుగొట్ల, కోవెలకుంట్ల, పొట్టిపాడు, హరివరం, కొత్తపల్లె, అల్లూరు ఫీడర్లకు సంబంధించి ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని పేర్కొన్నారు.

సంజామల: మండలంలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి పూట 9 గంటల విద్యుత్ సరఫరా చేయనున్నట్లు ఏఈ దుర్గ శ్రీనివాస్ తెలిపారు. సంజామల, ఆకుమల్ల, పేరుసోముల, నొస్సం సబ్‌స్టేషన్‌ల పరిధిలోని ఫీడర్లకు సంబంధించి విద్యుత్ సరఫరా వేళలను వివరించారు. ముక్కమల్ల, ఆల్వకొండ, రెడ్డిపల్లె, వసంతాపురం, కమలపూరి, ముదిగేడు, కానాల, అక్కంపల్లె, గిద్దలూరు, ఆర్.లింగందిన్నె, రామిరెడ్డిపల్లె, మిక్కినేనిపల్లె ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు.

వేలం పాట వాయిదా

బనగానపల్లె: మండలంలోని శైవక్షేత్రమైన యాగంటిలో ఈ నెల 17న టెంకాయల విక్రయం, తలనీలాలు, కొబ్బరి చిప్పల సేకరణకు జరగాల్సిన బహిరంగ వేలం వాయిదా వేసినట్లు ఆలయ ఈఓ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. కేంద్ర పురావస్తుశాఖ అభ్యంతరం మేరకు వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. అభ్యంతరాలు తొలగిన వెంటనే బహిరంగ వేలానికి తదుపరి తేదీ ప్రకటిస్తామని ఈఓ తెలిపారు.

మోక్షగుండం సేవలు మరువలేనివి


నివాళులర్పిస్తున్న మేస్త్రీలు

బనగానపల్లె రూరల్: నిర్మాణ రంగంలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య సేవలు మరువలేనివని ఎన్ఆర్ఈజీఎస్ ఈసీ, బనగానపల్లె మండల తాపీ మేస్త్రీల సంఘం గౌరవాధ్యక్షుడు మక్బుల్ హుస్సేన్ అన్నారు. ఆదివారం విశ్వేశ్వరయ్య జయంతిని(ఇంజినీర్స్ డే) పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య దేశంలోని సాగునీటి ప్రాజెక్టులు, రోడ్లు, ప్రాజెక్టుల నిర్మాణం చేసి గొప్ప ఇంజినీర్‌గా పేరుప్రతిష్టలు తెచ్చుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో సివిల్ ఇంజినీర్ మహ్మద్ నయూమ్ హుస్సేన్, మేస్త్రీలు షేక్షావలి, జాకీర్, బాషా, హమీద్, కట్టర్ మక్బుల్‌హుస్సేన్, గంగాధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయంలో చోరీ

కోవెలకుంట్ల: పట్టణ శివారులోని గుంజలపాడు రహదారిలో వెలసిన సాయిబాబా ఆలయంలో శనివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. స్థానికుల సమాచారం మేరకు.. శనివారం రాత్రి భోజనం చేశాక వాచ్‌మెన్ వెంకటేశ్వర్లు ఆలయ తలుపునకు గడియ పెట్టి లోపల పడుకున్నారు. గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు ఇనుప రాడ్లతో ఆలయ తలుపును బద్దలుకొట్టి లోపలికి ప్రవేశించారు. తలుపు పగలగొడుతున్న శబ్దానికి వాచ్‌మెన్ లేచి గట్టిగా కేకలు వేశాడు. ఆలయం పట్టణానికి ఒకటిన్నర కిలోమీటర్ ఉండడంతో అరుపులు ఎవరికీ వినిపించలేదు. దొంగలు లోపలికి వెళ్లి వాచ్‌మెన్‌కు ముసుగు కప్పి ఒకరు అక్కడే కాపలా ఉండగా మరో ఇద్దరు బీరువా పగలగొట్టి విలువైన ఆభరణాలు, నగదు కోసం గాలించారు. రెండు రోజుల క్రితం ఓ భక్తుడు ఆలయానికి రూ. 50 వేలు విరాళం ఇవ్వగా ఆ మొత్తాన్ని ఆలయ నిర్వాహకుడు సతీష్‌శర్మ సాయిబాబాకు అలంకరించే వస్త్రంలో దాచి బీరువాలో భద్రపరిచాడు. బీరువా అంతా వెతికినా ఎలాంటి ఆభరణాలు, నగదు లేదని దుండగులు భావించారు. సాయిబాబా గర్భగుడి ఎదురుగా ఉన్న రెండు హుండీలను పగలగొట్టి అందులో భక్తులు వేసిన దాదాపు రూ. 5 వేల నగదును ఎత్తుకెళ్లారు. బీరువాలో దాచి ఉంచిన నగదు భద్రంగా ఉండడంతో ఊపిరి పీల్చుకున్నారు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు రంగ ప్రవేశం చేసి చోరీ ఘటనపై విచారణ జరుపుతున్నారు. నంద్యాలకు చెందిన క్లూస్‌టీం చోరీకి సంబంధించి ఆధారాలు సేకరించింది.

హామీల అమల్లో జాప్యం తగదు


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నేత శ్రీకాంత్

డోన్ టౌన్: ఎన్నికల సమయంలో టీడీపీ కూటమి ఇచ్చిన హామీలను అమలు చేయాలని.. జాప్యం తగదని సీపీఎం పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి శివరామ్ డిమాండ్ చేశారు. ఆదివారం కొట్లవారిపల్లెలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ముందుగా సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులర్పించారు. ఎన్నికల సమయంలో కూటమి ఇచ్చిన హామీలు నేరవేర్చకుండా అధ్యయనాల పేరుతో కాలయాపన చేయడం తగదన్నారు. త్వరితగతిన అమలు చేయకుంటే ప్రజలతో కలిసి పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు.

నూతన కమిటీ ఎన్నిక

కొట్లవారిపల్లె సీపీఎం శాఖ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా రామాంజనేయులుతో పాటు మరో 12మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. సమావేశంలో సీపీఎం నాయకులు రామాంజనేయులు, నాగన్న, చిన్నరహిమాన్, భాస్కర్‌రెడ్డి, రాముడు, శ్రీనివాసులు, ఆంజనేయులగౌడ్ పాల్గొన్నారు.


డోన్: ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు


అవుకు: ఆనాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


బేతంచెర్ల: ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

డోన్ టౌన్: పట్టణంలోని ఎస్కేపీ హైస్కూల్‌లో 1988 సంవత్సరం పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఆదివారం చిన్నమల్కాపురం రహదారిలోని నగరవనంలో కలుసుకుని ఒకరికొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. మరణించిన స్నేహితులకు నివాళులర్పించి వారి కుటుంబాలకు ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో ఆలా వెంకటేశ్వర్లు, డాక్టర్ జగన్‌మోహన్, జీవన్, రఫీ, ఆదాం, కాలేషా, ధర్మవరం నాగిరెడ్డి, జొన్నలగడ్డ శ్రీధర్, జాకీర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ' కలయిక

అవుకు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1985-86 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. సుమారు 38 ఏళ్ల తర్వాత అవుకు జెడ్పీ ఉన్నత పాఠశాలలో కలుసుకుని ఆనాటి మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. ప్రతి ఒక్కరూ కుటుంబ సభ్యులతో కలిసి హాజరుకావడంతో పాఠశాల ఆవరణం పండుగ వాతావరణాన్ని తలపించింది. స్నేహితులందరూ ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అనంతరం వారికి పాఠాలు నేర్పిన పార్వతీశం, పక్కీరా రెడ్డి, సుబ్బరాయుడు, ఫక్రుద్దీన్‌లను శాలువాలతో సత్కరించారు. రవీంద్రనాథ్ రెడ్డి, రామిరెడ్డి, పక్కీరయ్య, భాస్కర్, ప్రసాద్, సత్యం, మధు, సతీష్, చంద్రహాస్ రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, జాఫర్, సత్యం, శైలజాకుమారి, నాగేశ్వరమ్మ, ప్రసన్నలక్ష్మీ, రేవతి, శ్రీదేవి, రాజేశ్వరి, లక్ష్మీదేవి, సుబ్బలక్ష్మీ, రమాదేవి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం జెడ్పీ హైస్కూల్‌లో 2001-2002 పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. 22 ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో ఒకరికొకరు ఆలింగనం చేసుకుని కష్టసుఖాలను పంచుకున్నారు. అనంతరం హెచ్ఎం మల్లికార్జునతో పాటు ఉపాధ్యాయులు దినకర్ నాయుడు, విజయ్ కుమార్, సుధాకర్, సుదర్శన్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, నాగేషు, మౌనిక, అరుణ, రామిరెడ్డిలను పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రఘు, గంగాధర్‌రెడ్డి, మల్లేష్, అనిల్, రామ సుబ్బయ్య, నారాయణ రెడ్డి, మౌనిక, మంజుల, ఆనంద్, మోహన్ రెడ్డి, బాల మద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

కొలుపల్లిలో గంగమ్మకు పూజలు

ప్యాపిలి: మండల పరిధిలోని కొలుపల్లి గ్రామంలో ఆదివారం గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పుడు గ్రామంలో గంగమ్మకు పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని గ్రామస్తులు తెలిపారు. కొత్త బానలో బియ్యం, నీటి కడవను జొన్నలపై ఉంచి పూజలు చేశారు. పూజారుల మంత్రోచ్చారణ మధ్య ముగ్గురు యువకులు బానపై చేతులు ఉంచి పూజలు చేశారు. బాన సునాయసంగా తిరగడంతో త్వరలో వర్షం కురుస్తుందని గ్రామస్తులు తెలిపారు. వర్షం కురిసే అవకాశం లేకపోతే బాన తిరగదని భక్తుల విశ్వాసం.